శరవేగంగా కేజీబీవీ పనులు

- పూర్తికావస్తున్న భవన నిర్మాణ పనులు
- తీరనున్న విద్యార్థినుల ఇక్కట్లు
- త్వరలో అందుబాటులోకి



నిర్మాణంలో ఉన్న భీంపూర్ కేజీబీవీ భవనం

తాంసి: భీంపూర్ కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు త్వరలో ఇక్కట్లు దూరం కానున్నాయి. తాత్కాలిక భవనంలో అవస్థలు పడుతూ చదువుతున్న విద్యార్థినులకు సొంత భవనం పూర్తయితే వసతులు సమకూరనున్నాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డైట్ కళాశాల హాస్టల్‌లో తాత్కాలికంగా కొనసాగుతున్న భీంపూర్ కేజీబీవీ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. గదులు, మౌలిక వసతులు కరువయ్యాయి. విద్యార్థినుల సౌకర్యార్థం ప్రభుత్వం సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది.

మిగిలిన చివరి దశ పనులు..

భీంపూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 90 శాతానికి పైగా భవన నిర్మాణ పనులు పూర్తి కాగా మిగిలిన పనులు చివరి దశలో ఉన్నాయి.

త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండటంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగుపడనున్న సౌకర్యాలు..

సొంతగా నిర్మిస్తున్న భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులకు సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. దీంతో తిప్పలు తప్పనున్నాయి. భీంపూర్ మండలానికి 2017– 18 సంవత్సరంలో కేజీబీవీని ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే సొంత భవనం లేక అరకొర వసతులు కలిగిన తాత్కాలిక భవనంలోనే నేటి వరకు కేజీబీవీని కొనసాగిస్తున్నారు. భీంపూర్‌లో స్థలం కేటాయించి రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో 2021 జూలైలో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. 300పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులు మండల కేంద్రంలోనే ఉండే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు తల్లిదండ్రులకు దూరభారం తగ్గనుంది.

నిర్మాణంలో అలసత్వం..

నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా పనులు చేస్తూ.. స్థానిక నాణ్యత లేని ఇసుకను వాడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతోందని మండల వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతగా పనులు చేపట్టే విధంగా చూడాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పుతాయి



మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనం అందుబాటులోకి వస్తే ఇబ్బందులు తప్పుతాయి. ప్రస్తుతం ఉన్న భవనంలో సరిపడా వసతులు లేక నిత్యం అవస్థలు పడుతున్నాం. విద్యార్థులకు సరిపడా గదులు లేవు.

– సనశ్రీ, 9వ తరగతి, భీంపూర్

త్వరగా పూర్తి చేయాలి



సొంత భవనం అందుబాటులోకి వస్తే అన్ని విధాలుగా బాగుంటుంది. విశాలమైన ఆటస్థలంతో పాటు గదులు సైతం సరిపడా ఉంటాయి. అధికారులు మాకోసం పనులు వేగవంతంగా చేపట్టేలా చర్యలు చేపట్టాలి.

– అమృత, 9వ తరగతి, భీంపూర్

పాఠశాలకు ఉపాధ్యాయుడి కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ అధికారులు డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిని కేటాయించారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని సాక్షి దినపత్రికలో సోమవారం 'వేధిస్తున్న టీచర్ల కొరత' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు చేపట్టారు. మండలంలోని కమట్‌వాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడిని డీఈవో ప్రణీత ఆదేశాల మేరకు వడూర్ పాఠశాలకు కేటాయించారు. సోమవారం విధుల్లో చేరి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఉపాధ్యాయుడి కేటాయింపుపై విద్యార్థులు, వారి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతర్గాం ప్రాథమిక పాఠశాలను సైతం కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీధర్ రెడ్డి పరిశీలించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు.



బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

క్రీడలతో మానసికోల్లాసం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వాగ్దారి గ్రామ బంజారా ఉషోదయ యువకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం బోథ్ ఎక్స్‌రోడ్‌లో ఉన్న పుట్టను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడం గర్వకారణం

నేరడిగొండ: జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో రాణించడం గర్వకారణమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి అజ్మీర రజిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అత్యవసర సమయంలో పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

గిరిజనేతరుల సమస్యల పరిష్కారానికి కృషి..

గిరిజనేతరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో గిరిజనేతరుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే గిరిజనేతరులకు పోడు భూములకు పహాణీలు, రుణాలు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, నాయకులు చంద్రయ్య, సలీం, మహేందర్ దూట రాజేశ్వర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

'బీఆర్‌ఎస్ హయాంలో ఆదివాసీలకు అన్యాయం'

ఇంద్రవెల్లి: ఆదివాసీలకు బీఆర్‌ఎస్ అన్యాయం చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సోమవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్‌పై చిన్న చూపు చూసిందని, ఆదివాసీ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పది సంవత్సరాల పాలనలో ఒక ఆదివాసీ కుటుంబానికి డబుల్ బెడ్‌రూం మంజూరు చేయాలేదన్నారు. అమరవీరుల స్తూపానికి స్మృతి వనంకు కోటి రూపాయలు కేటాయించారని, ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషకారమైన విషయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, షేక్ షఫీ, ప్రకాష్, లక్కేరావ్, భీంరావ్, మడావి లేతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'రైతుబంధు కోసం అన్నదాతల ఎదురుచూపు'

నేరడిగొండ: రైతుబంధు కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలో ఈ సీజన్‌కు సంబంధించి రైతుబంధు అందని పలువురు రైతులను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చాలామంది రైతులకు ఇప్పటికీ రైతుబంధు నిధులు వారి ఖాతాల్లో జమ కాలేదన్నారు. దీంతో యాసంగి సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి త్వరగా రైతుబంధు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రైతులు రామన్న, శ్రీనివాస్, సురేశ్, రాజు, అనిల్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలని ఆందోళన

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారని వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతర్గాం పాఠశాలలో మొత్తం 81 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఎంఈవో, డీఈవోకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జెడ్పీటీసీ సుధాకర్ పాఠశాలకు చేరుకొని డీఈవో ప్రణీతతో ఫోన్ మాట్లాడించారు. ఇందులో గ్రామస్తులు గంగారెడ్డి, రాకేశ్‌యాదవ్, పాఠశాల చైర్మన్ ఖాదర్, కపిల్ , తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని, విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని షీటీం సభ్యులు సుశీల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నెం.2లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా పోకిరీలు వేధిస్తే 100కు డయల్ చేయాలన్నారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు సత్యమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తుడుందెబ్బపై విమర్శలు సరికాదు'

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ)పై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యేకు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు తెలిసి కూడా విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పులతో స్తూపంపై ఎక్కితే ఆదివాసీ సంప్రదాయం ప్రకారం శుద్ధి చేయడం తప్పా అని ప్రశ్నించారు. ఆదివాసీలకే ఎంపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు పెందోర్ పుష్పరాణి, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, మండల అధ్యక్షులు జుగ్నాక్ భారత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కొడప సోనేరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీఆర్‌ఎస్ హయాంలో నాగోబా ఆలయ అభివృద్ధితో నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ పరమేశ్వర్, గేడం రాము, గంగయ్య, మహమ్మద్, రాజు, కొడప రాజు, కొమ్రా రాజు, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

సమావేశాలను జయప్రదం చేయండి

ఇచ్చోడ: ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ జిల్లా జనరల్ బాడీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు మాడావి గణేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ నెలకొల్పుతామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు సమస్యల నడుమ కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకాష్, మండల నాయకులు నాగేందర్, శంకర్, ఈశ్వర్, గిరిజ, శ్రీలత, జంగుబాయి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

బోథ్: తమ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని మండలంలోని సూర్యనగర్ గ్రామస్తులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు. 1960లో ఏర్పడిన గ్రామంలో 141 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ గ్రామంగా అన్ని అర్హతలున్నాయన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి

బోథ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంతకాలను సేకరించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మున్సిఫ్, ప్రధాన కార్యదర్శి ప్రేం, రవి, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బోథ్: ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎస్పీ పోతారాం శ్రీనివాస్ అన్నారు. సోమవారం బోథ్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయన్నారు ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. అనంతరం అంతరాష్ట్ర పోలీసుల సమావేశానికి మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలివెళ్లారు. వెంట సీఐ భీమేష్, ఎస్సై రాము, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చెక్కు అందజేత

కైలాస్‌నగర్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి సురేశ్ మండల్ ఇటీవల మరణించారు. దీంతో సైనిక సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సహాయం కింద రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. కాగా.. సోమవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు కలెక్టరేట్‌లో మృతుడి భార్య తపోసికు చెక్కు అందజేశారు. సైనికులతో పాటు రిటైర్డ్ సైనికులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

విజయవంతం చేయండి

గుడిహత్నూర్: కేంద్ర, రాష్ట్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్మిక, కర్షకులను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ధరాడే ఛాయ, మండల కార్యదర్శి ఇందుమతి, రేణుక, సంగీత, సురేఖ, హేమలత పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఇంద్రవెల్లి మండలంలోని రాంజీగూడ, మామిడిగూడ గ్రామ ఆదివాసీలు అన్నారు. సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇంటికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రాంజీగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామన్నారు. అలాగే మామిడిగూడ గ్రామానికి రోడ్డు, వాగు వద్ద కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంకా పనులు ప్రారంభించలేదన్నారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొడసం బండు, తొడసం తుకారం, సెడ్మాకి భీంరావ్, పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

నేరడిగొండ: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రతినిధులు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, అమృత్ కుమార్‌లు అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య అనే జ్ఞానం బోధన, సాంకేతిక సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. వ్యక్తిని సరైన ఆలోచన, నిర్ణయాధికారం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు..

జైనథ్: గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని ఖాప్రి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. తుదిశ్వాస వరకు ప్రజల మధ్యనే ఉంటానన్నారు. అనంతరం స్థానిక నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు సర్పంచ్ లింగారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, రాంరెడ్డి, రామన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

క్లుప్తంగా

'సీఎంను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు'

బోథ్: సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పసుల చంటి, గడ్డల నారాయణ, షేక్ అబూద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌వి చౌకబారు విమర్శలు

బోథ్: మాజీ సీఎం కేసీఆర్‌పై చౌకబారు విమర్శలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయిని దిగజార్చుకుంటున్నారని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు సురేందర్, శ్రీధర్ రెడ్డి, ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

ఇచ్చోడ: మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద సీసీరోడ్డు, రేకుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల గంగారాం, ఇచ్చోడ ఎంపీటీసీ శివకుమార్ రెడ్డి, గ్రామస్తులు సరాలశ్రీనివాస్, గోపుల వినోద్, కృష్ణం రాజు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

ఉట్నూర్‌రూరల్: కార్యకర్తలే పార్టీకి బలమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం హర్కాపూర్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ చారులత రాథోడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'లంబాడాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు'

బేల: లంబాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సిడాం నందకుమార్, ఉపాధ్యక్షుడు ఆత్రం ఫక్రు, సహాయ కార్యదర్శి ఆడ సంతోష్, రాయిసెంటర్ అధ్యక్షుడు కొరంగే సోనేరావు, మడావి చంద్రకాంత్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

జయంతికి తరలిరండి

బేల: ఇంద్రవెల్లిలో ఈనెల 26న నిర్వహించే గోండి ధర్మగురు హిరాసుక జయంతికి తరలిరావాలని ఆదివాసీ పర్ధాన్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేశ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీరామాలయం ప్రాంగణంలో జయంతి తాలుకు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుసాం ఆనంద్ రావు, మండల అధ్యక్షుడు నైతం సీతరాం, గేడం మాధవ్, పుసాం రితేష్, గేడం రమేశ్, ఉర్వతే సచిన్, పురుషోత్తం పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

ఇంద్రవెల్లి: బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, నాయకులు జైస్వాల్ శివకుమార్, మరప రాజు, దీపక్‌సింగ్ షేకవత్, ఆరెల్లి రాజలింగు, దేవ్‌పూజే మారుతి, మోరే దిలిప్, మస్కే రాజువర్ధాన్, రాథోడ్ భీంరావ్ పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు తగదు'

ఉట్నూర్‌రూరల్: సీఎం ఇంద్రవెల్లి పర్యటనపై తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు అసత్య ఆరోపణలు చేయడం తగదని తుడుందెబ్బ మాజీ జిల్లా అధ్యక్షుడు ఆత్రం తిరుపతి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి పర్యటనకు రావడంతో అమరవీరుల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. సమావేశంలో శ్యాంరావు, అన్నపూర్ణ, భీమా, సీతారాం, విజయ, వీనాబాయి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: దుకాణాదారుడిపై దాడి చేసిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై కలీం తెలిపారు. గత సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రంలోని ఖిల్లా మసీదు ప్రాంతంలో దుకాణంలో కొంత మంది చొరబడి దుకాణ యజమాని సాజిదు ల్లాఖాన్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా.. సోమవారం ఐదుగురు నిందితులు పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ నజీర్, సుందరయ్యనగర్‌కు చెందిన ఎజాజ్ హైమద్, అర్షద్ హైమద్, షేక్ షారూఖ్, ఇర్షద్ హైమద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

నేరడిగొండ: పదవీ కాలం ముగిసిన సందర్భంగా తేజపూర్ సర్పంచ్ అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డిని గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. రాజ్‌కిరణ్ రెడ్డి, మోహన్ రెడ్డి, పోతారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, పోతన్న, నానిరెడ్డి, కార్తీక్ రెడ్డి, నవనీత్ రెడ్డి, కన్నారెడ్డి, లింగారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పొచ్చెర, ధన్నూర్(బి) గ్రామాల్లో పలువురు ఇటీవల మృతి చెందగా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ ఎంపీపీ సజన్, సురేందర్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు గంగాధర్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో ఆయనను సోమవారం బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షు డు ధరణి రాజేశ్, నాయకులు వాసు, బాబా శ్యాంలు పరామర్శించారు.

మాజీ పీసీసీ అధ్యక్షుడికి నివాళి

కై లాస్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి సంతాప సభను సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు నరేశ్ జాదవ్, డీసీసీబీ డైరెక్టర్ బాలురి గోవర్ధన్ రెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. నర్సారెడ్డి ప్రజలకు, కాంగ్రెస్‌కు చేసిన సేవలను కొనియాడారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

తాంసి: మండలంలోని వడ్డాడిలో పురాతన స్వయంభూ లక్ష్మీ నరసింహ ఆలయంలో సోమవారం బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వారి వెంట ఎమ్మెల్యే కుమారుడు విశ్వజిత్ రాథోడ్, గ్రామస్తులు శ్రీనివాస్, షైమీర్, రమాకాంత్, స్వామి పాల్గొన్నారు.

అన్నదానం

ఉట్నూర్‌రూరల్: పేదల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నేరుగా గిరిజనులకు అన్నం వడ్డించారు. ఈకార్యక్రమంలో నాయకులు సలీం, మాజీద్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.